

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## 17వ కథ

***కథ మొదటి భాగం సంక్షిప్తంగా***

***డా. రాజ్ ఎఫ్ ఆర్ సి ఎస్ పరీక్ష లో ఎగ్జామినర్ గా వచ్చిన డా. కోలిన్ అతనితో కఠినంగా ప్రవర్తిస్తాడు. ఇరవై ఏళ్ళ తర్వాత డా. రాజ్ కూడా అదే ఎగ్జామినర్ గా కలకత్తా వెళితే అక్కడ తోటి ఎగ్జామినర్ గా వచ్చిన కోలిన్ ని కలుస్తాడు. వెంట ఉండి కోలిన్ కు కలకత్తా చూపిస్తాడు. కోలిన్ తన భార్యకోసం, పిల్లలకోసం చీరలు, దుస్తులు కొంటాడు. ఇద్దరి మధ్యా స్నేహం మొదలవుతుంది.***

***ఆ రాత్రి, కోలిన్ తన ప్రేమ కథ రాజ్ కు చెప్తాడు. చివర్లో కోలిన్ ఎంతగానో ప్రేమించే భార్య , కొడుకు చనిపోయారని తెలుస్తుంది డా. రాజ్ కు.***

నా రూం కి తిరిగి వచ్చాను. టైం ఎంత అయిందో తెలియదు.

రేపు ఎగ్జాం ఉంది. త్వరగా పడుకుంటే బెటర్ అని కళ్ళు మూసుకున్నాను.

రోజంతా ఎంత బాగా గడిచింది.

అలా అయిందేంటి?

అసౌకర్యంగా కదులుతున్నాను. నిద్ర పట్టదేం?

ఎంత వద్దనుకున్నా కోలిన్ కథ గుర్తొస్తూనే ఉంది.

చల్లని సాయంత్రం సముద్రం ఒడ్డున ప్రశాంతంగా నడుస్తుంటే, హఠాత్తుగా అగ్నిపర్వతం బద్దలై, ఆ సెగల్లో చిక్కుకు పోయినట్టు ఉంది కోలిన్ జీవితం.

మామూలుగా కనిపించే మనుషుల వెనక ఎంత బరువైన కథలుంటాయి. వాళ్ళ నవ్వుల వెనక ఎంత విషాదం ఉంటుంది. ప్రేమించిన వారు తోడుగా లేకపోవడం ఎంత బాధ.

రోజంతా తిరిగి తిరిగి అలిసిపోయి ఉన్నాను. కళ్ళు బరువుగా ఉన్నాయి కానీ నిద్రపట్టడం లేదు. ఎలాగైనా నిద్రపోదామని చూస్తున్నా.

రూం వేడిగా అనిపించింది . ఏసీ ఎక్కడుందో లైట్ వేసి చూశాను. ఏవో బటన్స్ ఉన్నాయి. తోచినట్టు నొక్కాను. విపరీతమైన చలి. మళ్ళీ ఏదో చేశాను.

లైట్ ఆపేసి నిద్రపోదామని ప్రయత్నిస్తున్నాను. లైట్ ఆపేసినంత తేలికగా ఆలోచనలను ఆపలేం కదా. ఎప్పటికో తెల్లవారు జామున నిద్రపడుతుందన్నట్టు అనిపించింది. కళ్ళు మూసుకున్న ఒక గంటకే వెలుగు కిరణాలు కళ్ళమీద పడి, మెలకువ వచ్చింది.

లేవగానే మొదట కోలిన్ గుర్తొచ్చాడు. భార్య, కొడుకు లేకుండా ఎలా బతుకుతున్నాడో కదా. నిన్న ఇద్దరం కలిసి తిరుగుతున్నపుడు గమనించాను. కొడుకు గురించి చెప్తుంటే కోలిన్ మాటల్లో ఎంతో ఉత్సాహం వినిపిస్తుంది.

ఎగ్జాం హాల్ కు వెళ్దామని రెడీ అవుతూ, సూట్ కేస్ తీశాను. నేను, ఏరోజు ఏం వేసుకోవాలో అన్నీ పద్ధతిగా సర్ది ఉన్నాయి. తను నాకోసం అమర్చే సౌకర్యాలను ఏనాడూ ఇంతగా గమనించలేదు.

బ్రేక్ ఫాస్ట్ దగ్గర కోలిన్ కనిపిస్తాడేమోనని చూశాను. కనిపించలేదు.

ఆనాడు పరీక్షల చివరి రోజు. నాతో పాటు కోలిన్ కాకుండా వేరే బ్రిటీష్ ఎగ్జామినర్ కూర్చున్నాడు. లంచ్ టైం లో కూడా కోలిన్ కనిపించలేదు.

అంతా అయేసరికి మధ్యాహ్నం నాలుగవుతూ ఉంది.

ఎగ్జాం హాల్ బయటకు వచ్చి చూస్తే, కోలిన్ మెట్ల దగ్గర నిలబడి ఉన్నాడు. నాకోసమే కారు ఆపి ఎదురు చూస్తున్నాడు. హోటల్ కు వెళ్ళేదారిలో ఆరోజు పరీక్ష విషయాలు మాట్లాడుకున్నాం.

ఆ రోజు రాత్రి తొమ్మిదింటికి నా ఫ్లైట్. హోటల్ ఖాళీ చేసి ఎయిర్ పోర్ట్ కు వెళ్ళడానికి చాలా టైముంది. కోలిన్ నాకన్నా ముందే ఎయిర్ పోర్ట్ కు వెళ్ళాలి. ఇద్దరం కలిసే వెళ్ళిపోదామనుకున్నాము. ఎయిర్ పోర్ట్ కు వెళ్ళేదారిలో ఇద్దరం ఫోన్ నంబర్లు, మెయిల్ ఐడీలు మార్చుకున్నాం.

ఎయిర్ పోర్ట్ లో బుక్ షాపులో నిలబడి పుస్తకం తీసి అక్కడే నిలబడి చదువుతున్నాడు. అతన్ని కదిలించకుండా కొంచం దూరం లో నిలబడి చుట్టూ హడావుడిని చూస్తూ ఉన్నాను.

కోలిన్ ఏదో బుక్ కొనుక్కుని వచ్చాడు. ఇద్దరం దగ్గర్లో ఉన్న కాఫీ షాపులో కూర్చున్నాం. పొద్దున్న హడావుడిలో ఇంటికి ఫోన్ చెయ్యలేదు. ఇంటికి ఫోన్ చెయ్యాలని మనసు లాగేస్తోంది.

ఫోన్ వంక చూస్తూ ఉంటే, తనే చేసింది. ఇలా చాలా సార్లు జరుగుతుంది మామధ్య. నేను చెయ్యాలనుకున్నపుడు తనో, తను ఎదురు చూస్తున్నపుడు నేనో ఫోన్ లో అందుబాటులోకొస్తాము.

ఫోన్ తీసుకుని పక్కకు వెళ్తే బాగుంటుందా అని సంశయిస్తూ ఉంటే , కోలిన్ లేచి "కారీ ఆన్" అని అంటూ వెళ్ళాడు.

"హలో"

"పక్కన ఎవరైనా ఉన్నారా?"

“ఏం అలా అడిగావు ?”

"మీ ‘హలో’ లో తేడా వుంటేనూ"

చిన్న 'హలో' తోనే హాల్లో సినిమా చూసేయగలదు.

"అవును, నిన్న ఒకాయన భార్యకోసం ఫోన్ లో నువ్వు చెప్పిన చీరలు కొన్నామే , ఆయన."

"ఇంతకూ కొన్నవి ఆమెకు నచ్చాయా?"

మరచిపోయిన ప్రశ్న మళ్ళీ మొలకెత్తింది. అసలెవరికోసం కొన్నాడు? కోలిన్ మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడా?

ఏం చెప్పాలో తెలియక

"ఆమె లేదు..అంటే, రాలేదు"

"ఓహ, ఈయనక్కడికి వెళ్తేగానీ తెలియదన్నమాట నచ్చాయో లేవో? కనుక్కుని చెప్పమనండి"

ఏం కనుక్కోవడమో? ఎవర్ని కనుక్కోవాలి?

"ఊ.. సరే" నిరాసక్తిగా అన్నాను.

"అవునూ, ఒకవేళ ఆమెకు నచ్చకపోతే?"

"నీ సెలెక్షన్ కేంటోయ్, సూపర్ కదా? " నేను ఎక్కడో ఉన్నట్టు మాట్లాడుతుంటే పసికట్టేస్తుందని, హుషారు తెచ్చుకుంటూ అన్నాను.

"ఈ సొంత డబ్బా ఎప్పట్నుండీ?"

అర్థం కావడానికి ఓ క్షణం పట్టింది.

ఇంటికి ఏ టైం కు చేరుకుంటానో అడిగితే చెప్పాను.

కోలిన్ రెండు కాఫీలతో తిరిగి వచ్చాడు.

"నేను మళ్ళీ మాట్లాడతానోయ్" అని పెట్టేశాను.

నా చేతికో కాఫీ ఇచ్చాడు.

ఆయనతో  తెప్పించినందుకు నొచ్చుకుంటూ, " సారీ మిస్టర్ కోలిన్, వైఫ్ ఫోన్ చేస్తే మాట్లాడుతున్నాను." అన్నాను.

పాప గురించి, తన గురించి వివరాలడిగాడు. ఆయన అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పి ,

"నిన్న మనం కొన్నవి మీ వైఫ్ కు నచ్చుతాయో, లేవోనని వర్రీ అవుతోంది."

"నచ్చాయో, లేదో చెప్పడానికి ఆమె బతికి లేదన్న విషయం నీ వైఫ్ కు తెలియదు కదా." నడుస్తూ అన్నాడు.

ఎయిర్ పోర్ట్ లో రద్దీ పెరుగుతోంది. మనుషులందరూ హడావుడిగా వెళుతున్నారు.

ఒకవైపు ఆమె లేదంటాడు. మరి ఎవరికోసం కొన్నట్టు?

సన్నిహితుల్ని కూడా కొన్ని సున్నితమైన ప్రశ్నలు అడగలేము.  తికమకగా చూస్తున్నాను.

నాకేమీ అర్థం కావడం లేదని అతనికి అర్థమైనట్లుంది.

ఇద్దరం చెరో వైపు వెళ్ళిపోవలసిన చోట నిల్చున్నాము. . అతను ఇమ్మిగ్రేషన్ వైపు వెళ్ళాలి.

చెప్పడానికి మొహమాట పడుతున్నట్టు,

"నా ఇంటి ముందు రెండు విగ్రహాలు ఉన్నాయి రాజ్. నా భార్యది, కొడుకుదీ. వాళ్ళకు తరచూ బట్టలు మారుస్తుంటాను. అందుకోసం కొన్నాను"

"విగ్రహాలా?" అశ్చర్యం వల్ల  నాకు తెలియకుండానే ఆ ప్రశ్న అడిగేశాను.

"ప్రాణముంది కాబట్టి వాళ్ళు వెళ్ళిపోయారు. విగ్రహాలు వెళ్ళలేవుగా రాజ్"

నవ్వడానికి ప్రయత్నించాడు. కోలిన్ నవ్వు గుండెను మెలిపెట్టేసింది.

ఏమిటిది?  మనుషులకు, బంధాలకు అటువైపు వారు పెద్దగా విలువ ఇవ్వరేమోనని అనుకునే వాడిని. ఇన్నేళ్ళల్లో ఇలాంటి మనిషిని చూడలేదే.

ప్రతిమాటతోనూ ఉత్తేజిత పరుస్తున్నాడు. నాకు తెలియని లోకం వైపు వైపు చూడమని ప్రేరేపిస్తున్నాడు. భావోద్వేగాల అంచున నన్ను నడిపిస్తున్నాడు.

అతని కళ్ళు చూస్తుంటే అవి ఇంకో స్త్రీ వైపు చూస్తాయా అన్న అనుమానం, చూడవన్న నమ్మకం ఒక్కసారే  కలిగాయి.

"బెస్ట్ ఆఫ్ లక్ రాజ్." వెళ్ళబోతూ నా చెయ్యి అభిమానంగా వత్తాడు.

"థాంక్స్ మిస్టర్ కోలిన్"

"కాల్ మి జస్ట్ కోలిన్" భుజం తట్టాడు.

నేను తేరుకునేలోపునే, కోలిన్ ఎస్కలేటర్ పైనున్నాడు. నావైపే చూస్తూ చెయ్యూపాడు.

తెల్లవారు జామున ఇంటికొచ్చాను. నా భార్యనూ, పాపనూ చూడక సంవత్సరాలైందనిపించింది. ఆ నాలుగు రోజులు కూడబెట్టిన కబుర్లతో ఇద్దరికీ టైం చాలనే లేదు. తెల్లవారిపోయింది.

ఆ తర్వాత తరచూ కోలిన్ గుర్తొస్తూ ఉండేవాడు. అతనితోపాటే అతని కథ కూడా. కొంతమంది తమ కథలకు తామే ముగింపు రాసుకుంటారు అనిపించేది.

మర్యాదకోసమే నా మెయిల్ ఐడి తీసుకుని ఉంటాడని అనుకున్నాను తప్ప అతని వద్దనుండి కబురు వస్తుందనుకోలేదు. ఎందుకంటే అధ్యాపకుడిగా, సర్జన్‌గా, కోలిన్

క్షణం తీరిక లేని వ్యక్తి . ఇంకా ఏవో ట్రస్ట్ బాధ్యతలు కూడా ఉన్నాయని చెప్పినట్టు గుర్తు.

నేను మెయిల్ చూడడం ఎప్పుడో కానీ చూడను. ఎప్పుడైనా ఆదివారం ఖాళీ ఉన్నపుడు చూస్తుంటాను.

'లోన్ ఇస్తామనీ, లాటరీ వచ్చిందనీ, స్నేహం కావాలా' అనీ ఇన్ బాక్స్ నిండా వేల వేల మెయిల్స్. ఒక్కదానికీ అర్థం పర్థం లేదు. అన్నిటినీ డిలీట్ చేస్తున్నాను.

"డాడీ, నీకు నిజంగా లాటరీ తగిలిందేమో , అలా చూడకుండా తీసేస్తున్నావే?" పక్కనే కూర్చున్న పాప అడిగింది.

"కష్ట పడకుండా ఏదీ రాదు. ఉచితంగా దొరికినవాటిలో రుచి ఉండదు."

డిలీట్ చేస్తూ ఉండగా ఒక చోట 'కోలిన్' పేరు కనిపించింది. కళ్ళు మెరిశాయి.

మెయిల్ చదవకుండానే లోపలెక్కడో చాలా సంతోషంగా అనిపించింది.

***డియర్ రాజ్,***

***ఎలా ఉన్నావు?***

***బాగున్నావా?***

***ఇక్కడికి వచ్చాక తరచూ గుర్తొస్తున్నావు.***

***ఇండియా రాబోయే ముందు ఆ విజిట్ చాలా ప్రత్యేకమవుతుందనీ, కలకత్తాలో కొన్ని విలువైన జ్ఞాపకాలు మిగులుతాయని నేనూహించలేదు. థాంక్యూ.***

***మన మొదటి పరిచయంలో నిన్ను హర్ట్ చేసినందుకు సారీ, రాజ్. నీతో ఎందుకలా ప్రవర్తించానో, ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. అలా చేయకుండా ఉండాల్సింది. నా పొరపాటు దిద్దుకోవడానికే నిన్ను కలిశానా అనిపించింది. అదే మన స్నేహానికి పునాది అయిందేమో.***

***టచ్ లో ఉంటావని ఆశిస్తాను.***

***కోలిన్***

మెయిల్ చదివాక లోపలి సంతోషం రెట్టింపైంది.

తరచూ కోలిన్ దగ్గరనుండి నాకో మెయిల్ వచ్చేది. ఎన్నో విషయాలు చర్చకు వచ్చేవి. వృత్తిపరమైన విషయాలకన్నా, జీవితానికి సంబంధించి ఎన్నో సంగతులు రాస్తుండేవాడు.

కోలిన్, నేనూ మాట్లాడుకోని విషయమే ఉండేది కాదు. స్నేహితులెంతోమంది ఉంటారు. అందరితో అన్నీ పంచుకోలేము. కొంత మందితో ఏదైనా మాట్లాడుకోగలం. మేమిద్దరం అలాంటి స్నేహితులమయ్యాము. మా స్నేహానికి వయసులో తేడా ఒక సమస్య కాలేదు.

ఎప్పటికప్పుడు నా ప్రోగ్రెస్ కనుక్కుంటూ ఉండేవాడు. నాకు సంబంధించిన చిన్న చిన్న విజయాలకు తనెంతో సంతోషపడేవాడు.

ఎక్కువగా ఉత్తరాల్లో తను కొడుకు గురించి రాసేవాడు. అతను కూడా ఏక్సిడెంట్ ముందురోజు పారిస్ అంతా తిప్పి చూపించాడట.

కొడుకంటే కోలిన్ కు ప్రేమకన్నా, స్నేహం ఉన్నట్టనిపించేది. ఇప్పుడు ప్రతి వారూ, మా పిల్లలతో మేము స్నేహితుల్లా ప్రవర్తిస్తామని ప్రకటించుకుంటున్నారు, కానీ కోలిన్ రాసే విషయాల్లో అర్థమైంది, కొడుకుతో తండ్రి స్నేహం ఎలా ఉంటుందో, ఎలా ఉండాలో!

ప్రతి ఉత్తరం నన్ను ఆశ్చర్యంలో ముంచేసేది. మనుషులు ఇలా ఉండగలరా అనీ, ఇంత నిజాయితో కూడిన ప్రేమ ఈ రోజుల్లో సాధ్యమా అని అనుమానపడే నాకు జవాబుగా నిలిచాడు కోలిన్. ఏమిటీ మనిషి?

పని అయిపోయాక మెయిల్ చెక్ చేసుకోవడం, కోలిన్ నుండి ఉత్తరం అందుకోవడం ఇష్టమైన వ్యాపకంగా మారింది.

పేషంట్లు, ప్రాక్టీసు లో పడి మధ్యలో గమనించలేదు కానీ, కొన్నాళ్ళ నుండీ కోలిన్ నుండి ఉత్తరాలే లేవు.

నేను పంపించిన మెయిల్స్ కు రిప్లై కూడా లేదు.

ఆరోగ్యం బాగోలేదేమో? ఏమయ్యుంటుందీ?

రెండు మూడు సార్లు ఫోన్ చేస్తే జవాబు రాలేదు.

ఏ కారణం వల్లనైనా నా మీద కోపం వచ్చిందా? నేనేమైనా పొరపాటు చేశానేమోనని, తనకు పంపించిన మెయిల్స్ ఒక సారి అన్నింటినీ చెక్ చేశాను.

అభ్యంతరకరంగా ఏమీ లేదు. మరి ఎందుకు మెయిల్స్ రావడం లేదు.

చాలా నెలల తర్వాత ఓ ఆదివారం, హఠాత్తుగా కోలిన్ పేరు ఇన్ బాక్స్లో కనిపించింది. ఎక్కడలేని ఉత్సాహం తో నా రక్తం పరుగులు తీసింది.

***రాజ్,***

***ఎలా ఉన్నావు?***

***ఇన్నాళ్ళూ నా నుండి మెయిల్ రానందుకు, నేనేమయ్యానా అని కంగారు పడుతూ ఉండి ఉంటావు. నీకిక మెయిల్స్ రాయలేనేమో. కారణాలు ఇవీ అని చెప్పలేను. చాలా కష్టపడి టైప్ చేస్తున్నాను. ( ఆ విషయం ఉత్తరం చదువుతుంటే అర్థమైంది)***

***ఇక నుండి 'Hi' మాత్రమే రాస్తాను. అంతే రాయగలను కూడా. నా దగ్గర్నుండి Hi' అని వస్తే నేను బాగున్నానని అనుకో.***

***నిన్ను మరచిపోయానని, ఎవాయిడ్ చేస్తున్నానని అనుకోవద్దు. నువ్వు క్షేమంగా సంతోషంగా ఉండాలి. అదే నా కోరిక.***

***కోలిన్***

వళ్ళంతా ప్రేమగా తడిమేసి, గుండెను తడి చేసిన భావన .

ఆ మెయిల్ నే నాలుగైదు సార్లు మళ్ళీ మళ్ళీ చదువుకున్నాను. ఇష్టమైన వారినుండి వచ్చే చిన్న కబురైనా ఎంత ఆనందాన్నిస్తుందో కదా!

ఉత్తరంలో కోలిన్ రాయలేని బాధంతా వినిపించింది.

ఎందుకంత బాధగా ఉన్నాడు.

ఆరోగ్యం బాగోలేదేమో. ఆ విషయం చెప్పడానికెందుకో ఇష్ట పడడు. అతనికిష్టం లేనివి గుచ్చి గుచ్చి అడగడం నాకూ ఇష్టం లేదు.

స్నేహం అంటే

స్నేహితుడి జీవితం లోకి చొరబడడం కాదనీ, పరిధి తెలుసుకుని మెలగడమని కోలిన్ తో స్నేహం వల్ల తెలిసింది.

'కోలిన్ , నేను చేయగలిగిన సహాయం ఏమైనా ఉంటే చెప్పండి.' అని మెయిల్ ఇచ్చాను.

నేను రెగ్యులర్ గా మెయిల్స్ రాస్తున్నాను. కోలిన్ దగ్గర్నుండి ప్రతినెలా ఒక 'హి' వస్తోంది.

దాన్నే మళ్ళీ మళ్ళీ చదువుకునేవాడిని.

కొన్నాళ్ళకు 'Hi' కూడా ఆగిపోయింది.

ఎన్ని రోజులైనా జవాబు లేదు. యు కెలో ఉన్న నా ఫ్రెండ్స్ ని కనుక్కుందామంటే దాదాపు అందరూ వచ్చి ఇండియాలో సెటిల్ అయిపోయారు. వేణు ఉంటే తప్పనిసరిగా వెళ్ళేవాడు. తను కూడా ఇండియా వచ్చేశాడు.

ప్రతిరోజూ కోలిన్ మెయిల్ వస్తుందేమోనని చూడడం, నిరాశచెందడం మామూలైపోయింది. పని వత్తిడి, రోజువారీ పరుగుల మధ్య, ఎంత బిజీగా ఉన్నా సరే, కోలిన్ విషయం ఎక్కడో బాధ పెడుతూనే ఉండేది. పని అయ్యాక మెయిల్ చెక్ చెయ్యడం మాత్రం మాన లేదు.

యు కె నుండి ఉద్యోగం ఇస్తామన్న మెయిల్స్ తప్ప ఏమీలేవు. ఎవరెవరో ఫోన్ చేస్తూ ఉంటారు అక్కడ ఉద్యోగానికి రమ్మనమని. ఈ మధ్య ఎక్కువగా ఒక హాస్పిటల్ నుండి అలాంటి కాల్స్ ఎక్కువైనాయి. రావడం కుదరదని చెప్పాను.

నేనిచ్చే మెయిల్స్ కూడా రిప్లై లేదు. ఒక సారి వెళ్ళి చూడాలని అనుకున్నాను. కానీ కోలిన్ అనుమతి తీసుకోకుండా ఎలా?

***కోలిన్,***

***మీరెలా ఉన్నారోనని తెలియడం లేదు. మీకు అభ్యంతరం లేకపోతే వచ్చి చూడాలని ఉంది. మీకెప్పుడు వీలవుతుందో చెప్పండి.***

***రాజ్***

ఒక మెయిల్ ఇచ్చాను. దానికి కూడా జవాబు లేదు.

స్నేహం వలన హక్కులొస్తాయని అనుకోవడం పొరపాటు.

స్నేహం నిలబడాలంటే , పరిమితులు తెలుసుకోగలగాలి.

ఆ రోజు శనివారం. ఉదయం పేపర్ చదువుతున్నాను. రెండు రోజులనుండీ, పాప నా లాప్ టాప్ మీద వాళ్ళమ్మతో కలిసి ప్రాజెక్ట్ చేసుకుంటోంది. రేపే సబ్మిట్ చెయ్యాలట. హడావుడి పడుతున్నారు. వాళ్ళ నవ్వులు, వాదనలు నా చెవిన పడుతూనే ఉన్నాయి. మధ్య మధ్యలో పాప, అమ్మకు కంప్యూటర్ నేర్పిస్తోంది. ఒక్కోసారి ఇద్దరూ ఆర్గ్యుమెంట్ చేసుకుని తీర్పు కోసం నాదగ్గరకు వస్తున్నారు.

హాస్పిటల్ కు వెళ్ళే టైం అవుతోంది.

"డాడీ, ఎవరో మెలిండా అట, నీతో మాట్లాడాలట. మెసేజ్ వస్తోంది." లాప్ టాప్ వంక చూస్తూ అంది

"నిన్న కూడా చూశాను . ఎవరో ఒక సారి చూడండి." తనుకూడా చెప్పింది.

" అవన్నీ స్పామ్ మెయిల్స్. డిలీట్ చెయ్యండి." అంటూ పేపర్ పక్కన పడేసి లేచాను.

కోలిన్ మెయిల్ ఇవ్వకపోవడం తో మెయిల్స్ చూడడానికి ఆసక్తి ఉండడం లేదు.

థియేటర్ లోపలికి వెళ్ళ బోయే ముందు నా ఫోన్ బయట నా అసిస్టెంట్ రాంబాబు కు ఇచ్చేస్తాను. ఎలాంటి ఫోన్ కాల్ అయినా సరే మేనేజ్ చెయ్యగల సమర్థుడు. సర్జరీ జరుగుతున్నపుడు నన్ను డిస్టర్బ్ చెయ్యడం చాలా అరుదుగా జరుగుతుంటుంది.

ఆ రోజు రాంబాబు లోపలికి వచ్చాడు. చేతిలో నా ఫోన్ ఉంది.

"సార్. మీతో ఎవరో లేడీస్ మాట్లాడాలంటున్నారు"

"కేస్ అయినాక ఓపీకెళ్తాను. ఓపీకి రమ్మను."

"ఇక్కడి ఫోన్ కాదు సార్. యు కె నుండి మాట్లాడుతున్నారు"

"సరే అయితే , ఫోన్ నంబర్ తీసుకో. ఖాళీ అయాక ఫోన్ చేస్తాను" అతని తో చెప్పి పనిలోపడిపోయాను.

ఎప్పటికో సర్జరీ అయ్యాక, నేను ఎనస్థీషియా డాక్టర్ టీ తాగుతూ మాట్లాడుకుంటున్నాము. రాంబాబు వచ్చి ఒక చిన్న చీటీ ఇచ్చాడు.

ఫోన్ నంబర్ వేసి ఉంది ఆ చీటీలో . కింద పేరు కూడా రాసి ఉంది.

మెలిండా.

ఈ పేరు ఎక్కడో విన్నాను అనుకుంటూ వేరే సర్జరీ రెడీ అయిందంటే లోపలికి వెళ్ళిపోయాను.

ఆ రోజంతా హాస్పిటల్ లోనే గడిచిపోయింది. ఇంటికెళ్ళే సరికి అర్ధరాత్రి అయింది.

ఆ రోజు ఇంటికెళ్ళాక చూస్తే, ఒక యు కె నంబర్ నుండి మెసేజ్ ఉంది.

ఒక సారి వీలు చూసుకుని ఫోన్ చెయ్యండి.

–మెలిండా

అప్పటికే అర్ధ రాత్రి అవుతోంది. రేపుదయాన్నే చూద్దామనుకుని పడుకున్నాను.

నిద్ర లేచే సరికి తెల్లవారింది. టేబిల్ మీద పేపర్, బ్రేక్ ఫాస్ట్ , కాఫీ రెడీగా ఉన్నాయి. తను పాపను కాలేజ్ కు దించడానికి వెళ్ళిందేమో ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. తనొచ్చాక ఇద్దరం కలిసి తినొచ్చని పేపర్ తీశాను.

దుర్గా శరన్నవరాత్రులు జరుగుతున్నాయి. పేపర్ మొదటి పేజీలో క్రితం రోజు అమ్మవారి అలంకారం ఫోటో ఉంది.

ఆ ఫోటో చూస్తుంటే కలకత్తా కాళీ మాత గుర్తొచ్చింది.

' కోలిన్, ఏమైపోయావు. ఒక్క సారి మాట్లాడు కోలిన్.' మనసులోనే అనుకున్నాను.

ఫోన్ మోగింది.

"హలో, ఎవరు?"

"నేను మెలిండా."

ఎవరీ మెలిండా?

ఒకరినొకరు మర్యాదపూర్వకంగా విష్ చేసుకోవడం అయినాక

"చెప్పండి. ఏమిటి విషయం?" అడిగాను.

"మీకు డా. కోలిన్ తెలిసే ఉంటారు కదా."

ఉలిక్కి పడ్డాను.

కోలిన్,

"అవునూ, మీరు.."

"నేను వాళ్ళమ్మాయిని"

వళ్ళంతా గగుర్పొడించింది. ప్రవాహంలో కొట్టుకునిపోతున్నవాడికి ఆధారం దొరికినట్లుంది.

"కోలిన్ ఎలా ఉన్నారు. అసలు కబురే లేదు. ఆరోగ్యం బాగుందా? మీదగ్గరే ఉన్నారా? ఉంటే ఒక్క సారి ఫోన్ ఇవ్వండి ప్లీజ్" ఫోన్ ఎటికేట్ నాకు తెలియదని ఆవిడ అనుకున్నా పర్వాలేదన్నట్టు మాట్లాడుతున్నాను.

"మిస్టర్ రాజ్, ఆయన మాట్లాడ గలిగితే నేనెందుకు ఫోన్ చేస్తాను. నేను చెప్పే విషయాలు మీరు కొద్దిగా ఓపికగా వినాలి. వినాలని మా ఫాదర్ కోరిక. ఇంతకూ మీరు ఖాళీగా ఉన్నారా?" నా ఆదుర్దాని చదివేసినట్టు మాట్లాడింది.

“నేను ఖాళీగానే ఉన్నాను. మీరు చెప్పండి.” సోఫాలోంచి ఎప్పుడు లేచానో తెలియదు. అటూ ఇటూ తిరుగుతూ మాట్లాడుతున్నాను.

"నాన్న తన డైరీ నాకిచ్చి చదవమన్నారు. అందులో మీకు సంబంధించిన విషయాలెన్నో ఉన్నాయి.”

“నాకు సంబంధించిన విషయాలా?”

“అవును. ఆయన జీవితం లో మీరెంతో ముఖ్యమైన వ్యక్తి . అది తెలుసా మీకు?”

“నేనా? అయాం హిజ్ ఫ్రెండ్ . నాకు తెలుసు”

“కాదు. అంతకన్నా ఎక్కువ. ఆ విషయం మా ఫాదర్ డైరీ చదివిన తర్వాతే నాకూ తెలిసింది. మీకు కూడా తెలియజేయడం నా బాధ్యత”

ప్రతి మాటకు ఆశ్చర్య పోతున్నాను.

“ ముందు రిలాక్స్ అవండి. నేను చదువుతుంటాను. కూల్ గా వినండి.”

ఆమె నెమ్మదిగా డైరీ చదువుతోంది.

*“రాజ్, జీవితం లో కొన్ని పరిచయాలు ప్రత్యేకం!*

*వాటికో లక్ష్యం, సార్థకత ఉంటుంది. ఆ స్నేహాలు మన ప్రమేయం లేకుండా ఎక్కడో, ఎప్పుడో నిర్ణయమై పోయి ఉంటాయి. అలాంటిదే మనిద్దరి పరిచయం. నీకు ఎగ్జామినర్ గా నేను రావడం, మళ్ళీ మనిద్దరం కలకత్తాలో కలుసుకోవడం యాదృచ్ఛికం అని అనుకోను.”*

కలకత్తాలో మేమిద్దరం తిరిగిన ప్రదేశాల వివరాలన్నింటినీ అందమైన కథలా రాసుకున్నాడు. ఏ చిన్న విషయాన్నీ వదలలేదు. నేను తన పట్ల చూపిన అభిమానం ఎంత విలువైనదో కోలిన్ మాటలలో వింటుంటే, అందులో నేను చేసిందేమిటో నాకర్థం కాలేదు. మేమిద్దరం మెయిల్స్ లో చెప్పుకున్న ప్రతి మాటా అతనికి అపురూపమైంది.

*“నీకు తెలియదు కదా రాజ్. మా అబ్బాయి అచ్చం నీలానే ఉండేవాడు. వాడు కూడా యాక్సిడెంట్ ముందు రోజు, నా వెంటే ఉండి పారిస్ అంతా తిప్పి చూపించాడు. కలకత్తాలో నువ్వు నన్ను జాగ్రత్తగా చూసుకుంటూ అన్ని చోట్లకూ తిప్పుతుంటే, అచ్చం వాడిలానే అనిపించావు. నా బిడ్డలానే చూసుకున్నావు నన్ను.*

*రాజ్, నిన్ను రోజూ చూడాలని అనిపిస్తోంది. రోజూ మాట్లాడాలనిపిస్తుంది.*

*రోజూ నిన్ను చూసుకోవచ్చన్న స్వార్థం తో నీకోసం ఇక్కడ ఉద్యోగం చూశాను. ఆ హాస్పిటల్ అథారిటీస్ తో నీకు ఫోన్ చేయించాను కూడా. నువ్వు వద్దన్నావని చెప్పారు. ఒకందుకు మంచిదేమోలే.*

*నాకిష్టమైన వాళ్ళందరూ లోకం విడిచి వెళ్ళిపోతున్నారు రాజ్. నా భార్య, నా కొడుకు.*

*ఈ మధ్యనే బాగా సన్నిహితులైన ఇద్దరు స్నేహితులూ కూడా నన్ను విడిచి వెళ్ళిపోయారు.*

*నిన్ను నేను పోగొట్టుకోకూడదు. నా ప్రేమ నీ పాలిట దురదృష్టం కాకూడదని నీకు దూరంగా ఉన్నాను. నిన్ను దూరంగా ఉంచాను.*

*నువ్వెవరో తెలియదనే అనుకుంటాను.*

*మనలోని ప్రేమ ఒకరికివ్వగలగడం ఎంత అదృష్టం రాజ్. ఆ వ్యక్తికి చెందాల్సిన ప్రేమను లోపలే దాచుకోవాల్సి వస్తే అంతకన్నా శిక్ష లేదు. ఆ శిక్ష అనుభవిస్తున్నాను. నీ మీద ప్రేమకొద్దీ ఆ శిక్షననుభవించనీ. "*

*నేను నీతో మాట్లాడడం లేదని నువ్వు బాధపడే ఉంటావు. నువ్వు బాధపడినా సరే, నువ్వు క్షేమంగా ఉండాలి. నీ కుటుంబం కోసం, ఎంతో మంది పేషంట్ల కోసం నువ్వు క్షేమంగా ఉండాలి. నా ప్రేమ నాలోనే ఉండనీ ."*

*చివరిలో*

*'ఒక వేళ తను చనిపోతే, మెలిండాతో బాటు , రాజ్ కు కూడా తెలియపరచమనీ,*

***ఒక ముఖ్యమైన ట్రస్ట్ బాధ్యతలు, కొడుకుగా నాకు బదిలీ చేస్తున్నట్టు రాసుకున్నాడు.***

కోలిన్ ప్రేమతో రాసిన ప్రతి పదం, పదునుగా గుచ్చుకుపోతోంది.

అవి చదవడానికి మెలిండా ఎంతో కష్టపడుతోంది. వినడానికి నేనంత కన్నా కష్టపడుతున్నాను.

నేను మాట్లాడిన ప్రతి మాటా అతను ఆణిముత్యంలా భద్రపరుచుకుంటాడనుకోలేదు.

ఒక్కొక్కటి చదివి వినిపిస్తుంటే, నా కళ్ళవెంట ముత్యాలు జలజలా రాలిపోతున్నాయి.

చాలా సేపటి వరకూ మౌనంగా ఉన్నాను. దుఃఖం తగ్గినట్టు అనిపిస్తున్నా గానీ, హృదయం కల్లోలిత సముద్రం లా ఉంది.

ఎప్పటికో చాలా ప్రయత్నం మీద

"కోలిన్ తో ఒక్క సారి మాట్లాడొచ్చా?"

"డా. రాజ్, అయాం సారీ, ఫాదర్ పోయి ఒక నెల అవుతోంది. చివరిరోజుల్లో ఈ డైరీ చదవమని వత్తిడి చేశారు కానీ ఎందుకోసమో నాకర్థం కాలేదు. ఆయన పోయాకే చదివాను. చదివిన తర్వాత మీతో మాట్లాడాలని ఎంతో ప్రయత్నం చేశాను. ఇన్నాళ్ళకు వీలయ్యింది."

కోలిన్ , ఒక్క సారి నిన్ను చూసుకుంటే ఎంత బాగుండేది. ప్రేమ దాచుకుని నువ్వెంత బాధ పడి ఉంటావు, నాకెంత శిక్ష వేశావు కోలిన్?

నీకు నువ్వు తండ్రిలా ప్రేమించావు.

నన్ను మాత్రం ఋణం తీర్చుకోలేని కొడుకుగా చేశావు.

'కోలిన్ , కోలిన్' అన్న మనసు పిలుపు గుండె చప్పుడయ్యింది.

దుఃఖం హృదయం లో ఇమడలేకపోతోంది.

ఆగని ఉద్వేగమయ్యాడు. వేగంగా కళ్ళలోంచి ప్రవహించాడు.

మనసులో అందరికీ ఎన్నో ఉద్వేగాలుంటాయి. కన్నీళ్ళు ఎక్కడో నిక్షిప్తమై ఉంటాయి. ఎవరో వచ్చి తలుపులు తెరిచేవరూ అవి ఉన్నాయని కూడా మనం ఎరగం.

దూరంగా గేటు చప్పుడైంది. కారు లోపలికి వస్తోంది.

గుడికి వెళ్ళొచ్చిందేమో తను , పట్టుచీరతో ఉంది.

లోపలికి రాగానే నేను తిన్నానో లేదని టేబిల్ దగ్గరకు వచ్చి చూసి, నేనేమీ ముట్టుకోలేదని,

"పాపని దించి, దుర్గ గుడికి వెళ్ళొచ్చేసరికి లేటైంది. మీరింకా బ్రేక్ ఫాస్ట్ చెయ్యలేదే?"

మాట్లాడడానికి ఏదో అడ్డుపడుతోంది.

"పోనీలెండి ప్రసాదం తినండి ముందు."

అంటూ నేను కూర్చున్న దగ్గరకొచ్చి  ప్రసాదం నా కళ్ళకద్ది ,  తినమని ఇచ్చింది.

నేను మౌనంగా ఉండడం చూసి

"ఏమైంది?

'ఏం చెప్పాలి. ఎలా చెప్పాలి. ఎక్కడనుండి మొదలు పెట్టాలి.' ఆలోచిస్తున్నాను.

"యు కె వెళ్ళాలి."

నా వంక ఒక నిముషం చూసింది.

లోపలికివెళ్ళి గ్లాస్ తో చల్లని మంచి నీళ్ళు తెచ్చిచ్చే వరకూ దాహంతో ఉన్నానని నాకూ తెలియదు.

లాప్ టాప్ తెచ్చి పక్కనే కూర్చుంది.

ఎక్కడికి వెళ్ళాలన్నా సరే, ఆ ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ తనే చూసుకుంటుంది.

"ఎప్పటికి?"

"వీలైనంత త్వరగా,  నువ్వు కూడా రావాలి."

ఆశ్చర్యంగా చూసింది. మళ్ళీ మాట్లాడకుండా ఆ పనేదో చూస్తోంది.

మాటలే కాదు , మౌనాన్ని కూడా అర్థం చేసుకోగల అర్థాంగి.

*కథ వ్రాయడానికి అవకాశం ఇచ్చిన రాజశేఖర్ , సురేఖ దంపతులకు నా ధన్యవాదాలు . వారికి అంతా శుభం జరగాలనీ, వారింట్లో సదా సుఖసంతోషాలు నిండాలని కోరుకుంటూ*

*మరోసారి కృతజ్ఞతలు*

*చందు శైలజ*

*డా. గువ్వల రాజశేఖర రెడ్డి ,*

*MS FRCSed, FRCSeng*

*రాయల్ హాస్పిటల్, కస్తూరిబాయి పేట,*

*విజయవాడ - 520010*



Post your comments